జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 26 | ఆగస్టు | 2026 | పేజీలు : 8


## షెడ్యూల్ తెగల ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టిన కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్

- ఎస్టి కమిషన్ దృష్టికి విచారణకు వచ్చిన 40 కేసులు
- గిరిజనుల హక్కుల సంక్షేమానికి ప్రత్యేక దృష్టి సారించి ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి
- ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 25,(ప్రజా జ్యోతి)** జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో షెడ్యూల్ తెగలకు సంబంధించిన ఫిర్యాదులు, కేసులపై సమగ్ర విచారణ చేపట్టారు. కమిషన్‌కు అందిన

మిగతా 2 లో...



## సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్అండ్ఆర్ సమస్యలను వేగంగా పరిష్కరించాలి
- భూ సేకరణ ప్రక్రియను చీఫ్ ఇంజనీర్లు సవాల్గా తీసుకొని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 25 ,(ప్రజా జ్యోతి)** సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, నిర్దేశిత ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పునరావాసం–పునరావాస పునరుద్ధరణ (ఆర్అండ్ఆర్), అటవీ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్

మిగతా 2 లో...

- 'కిన్నెర–రూట్‌వెల్' బినామీ దందాలో వెలుగుచూస్తున్న విస్తుపోయే నిజాలు
- 1995 లోనే బ్సిడీ తీసుకుని బోర్డు తిప్పేశారు..
- 25 ఏళ్ల తర్వాత కోర్టు ముసుగులో కదలిక
- సేల్ డీడ్ లేకున్నా 'అబ్సల్యూట్ ఓనర్' అంటూ ప్రైవేట్ అగ్రిమెంట్
- టీఎస్ఐఐసీ అనుమతి లేకుండానే కార్యకలాపాలు..
- పరికరాలు లేకుండానే లైసెన్సులు
- అదే ప్రాంగణాన్ని చూపి.. రూ.3.75 కోట్ల రుణం?




2 లో..

### అధికారులను బురిడీ కొట్టించి..
# రూ.3.75 కోట్ల రుణం?

రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం తేవాలని ప్రభుత్వాలు చవకగా భూములిస్తే.. కొందరు ఘటనాపాటీలు దాన్ని కోట్ల రూపాయల అక్రమ సంపాదనకు లైసెన్సుగా మార్చుకుంటున్నారు. పరిశ్రమ పేరు చెప్పడం, ప్రభుత్వ సబ్సిడీలు నొక్కడం, ఆపై కొన్నేళ్లకే బోర్డులు తిప్పేయడం ఒకెత్తయితే.. సేల్ డీడ్ కూడా లేని అదే ప్రభుత్వ స్థలాన్ని చూపి బ్యాంకర్లను, అధికారులను ఏమార్చి రూ.3.75 కోట్ల రుణాలను ఖాతాల్లో వేసుకోవడం మరొకెత్తు! కొత్తగూడెం పారిశ్రామిక వాడలోని ప్లాట్ నంబర్ 17 (9,344 చదరపు మీటర్లు) కేంద్రంగా నడిచిన 'కిన్నెర మార్బుల్స్ - రూట్‌వెల్ ఆగ్రో వెట్' కథనాన్ని లోతుగా శోధిస్తే, వ్యవస్థలోని లొసుగులను అడ్డం పెట్టుకుని సాగించిన బినామీ దందా పత్రాలతో సహా బహిర్గతమవుతోంది.

- భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

## వనమహోత్సవవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే



**అశ్వరావుపేట ప్రజా జ్యోతి ఆగస్టు 25** అశ్వరావుపేట: మండలంలోని ఉట్లపల్లి గ్రామంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో జారే పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాలకు పచ్చని భవిష్యత్తు అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

వన మహోత్సవం సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించడంతో పాటు వాతావరణ సమతుల్యతకు చెట్లే ఆధారమని, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

**మొక్క నాటి వదిలేయకుండా.. సంరక్షణే లక్ష్యం**

ప్రతి కుటుంబం, ప్రతి యువకుడు, విద్యార్థి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. గ్రామాల్లో హరితవనం పెంచేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఊట్లపల్లి సర్పంచ్ మరియు ఆత్మ కమిటీ చైర్మన్ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఈ పాపం ఎవరిది?

వేటగాళ్ల ఉచ్చుకు నిండు ఆడ గర్భిణి దుప్పి మృతి

గాయపడిన దుప్పిని కాపాడేందుకు వైద్యులు విఫల యత్నం చేసిన ఫలితం శూన్యం



3 లో...

- ప్రాణాలతో పోరాడుతూ చివరకు మృత్యువాత పడిన దుప్పి
  దుప్పిని పోస్టుమార్టంకు తరలింపు
- వేటగాళ్ల దుశ్చర్యకు అడ్డుకట్ట వేసేది ఎవరు?
- ఉచ్చులు వేసే వేటగాళ్లపై కొరవడిన వైల్డ్ లైఫ్ ఫారెస్ట్ అధికారులు నిఘా
- ఇప్పటికైనా అధికారులు వేటగాళ్లపై నిఘా పెంచి వన్యప్రాణులను కాపాడాలి

# సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి...)

నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణ, ఆర్అండ్ఆర్ సమస్యలపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఐడీఓసీ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ప్రాజెక్టుల వారీగా అవసరమైన భూసేకరణ, పెండింగ్‌లో ఉన్న ఆర్అండ్ఆర్ చెల్లింపులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియను చీఫ్ ఇంజినీర్లు సవాల్‌గా తీసుకుని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. భూసేకరణ, ఆర్అండ్ఆర్‌కు సంబంధించిన టోకెన్లను త్వరితగతిన క్లియర్ చేయడంతో పాటు పెండింగ్ అవార్డులను వీలైనంత త్వరగా పాస్ చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ల పీడీ ఖాతాలకు చేరిన నిధులు అర్హులైన లబ్ధిదారులకు త్వరగా చేరేలా చర్యలు తీసుకోవాలని, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ సమస్యల్లో ఎలాంటి అవరోధాలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని మంత్రి సూచించారు. అవసరమైన అంశాలను తన దృష్టికి నేరుగా తీసుకురావాలని కలెక్టర్లను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, ఆర్అండ్ఆర్ సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ అవార్డులు, టోకెన్లు, పరిహారం చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల పనులకు భూసేకరణ, ఆర్అండ్ఆర్ సమస్యలు అవరోధంగా మారకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైన చోట సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నీటిపారుదల, భూ సేకరణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# షెడ్యూల్ తెగల ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టిన కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్




(మొదటి పేజీ తరువాయి...)

వివిధ ఫిర్యాదులపై సంబంధిత అధికారులు, ఫిర్యాదుదారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 40 కేసులను విచారణకు స్వీకరించి, ఆయా కేసులకు సంబంధించిన రికార్డులు, నివేదికలను పరిశీలించారు. కేసుల వారీగా సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న కమిషన్ సభ్యుడు, ఫిర్యాదుల పరిష్కారానికి ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. షెడ్యూల్ తెగలకు సంబంధించిన సమస్యలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.విచారణ సందర్భంగా అధికారులు ఆయా కేసులకు సంబంధించిన రికార్డులు, నివేదికలను కమిషన్ సభ్యుడికి సమర్పించి వివరాలను వెల్లడించారు. గిరిజనుల హక్కులు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఫిర్యాదుల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విచారణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

- ‘కిన్నెర–రూట్‌వెల్’ బినామీ దందాలో వెలుగుచూస్తున్న విస్తుపోయే నిజాలు
- 1995 లోనే బ్సిడీ తీసుకుని బోర్డు తిప్పేశారు..
- 25 ఏళ్ల తర్వాత కోర్టు ముసుగులో కదలిక
- సేల్ డీడ్ లేకున్నా ‘అబ్సల్యూట్ ఓనర్’ అంటూ ప్రైవేట్ అగ్రిమెంట్
- టీఎస్ఐఐసీ అనుమతి లేకుండానే కార్యకలాపాలు..
- పరికరాలు లేకుండానే లైసెన్సులు
- అదే ప్రాంగణాన్ని చూపి.. రూ.3.75 కోట్ల రుణం?




## అధికారులను బురిడీ కొట్టించి..

# రూ.3.75 కోట్ల రుణం?

**రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం తేవాలని ప్రభుత్వాలు చవకగా భూములిస్తే.. కొందరు ఘటనాపాటీలు దాన్ని కోట్ల రూపాయల అక్రమ సంపాదనకు లైసెన్సుగా మార్చుకుంటున్నారు. పరిశ్రమ పేరు చెప్పడం, ప్రభుత్వ సబ్సిడీలు నొక్కడం, ఆపై కొన్నేళ్లకే బోర్డులు తిప్పేయడం ఒకెత్తయితే.. సేల్ డీడ్ కూడా లేని అదే ప్రభుత్వ స్థలాన్ని చూపి బ్యాంకర్లను, అధికారులను ఏమార్చి రూ.3.75 కోట్ల రుణాలను ఖాతాల్లో వేసుకోవడం మరొకెత్తు! కొత్తగూడెం పారిశ్రామిక వాడలోని ప్లాట్ నంబర్ 17 (9,344 చదరపు మీటర్లు) కేంద్రంగా నడిచిన ‘కిన్నెర మార్బుల్స్ - రూట్‌వెల్ ఆగ్రో వెట్’ కథనాన్ని లోతుగా శోధిస్తే, వ్యవస్థలోని లొసుగులను అడ్డం పెట్టుకుని సాగించిన బినామీ దందా పత్రాలతో సహా బహిర్గతమవుతోంది.**

● భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

### ›› హక్కుల్లేని భూమిపై ‘సంపూర్ణ యజమాని’ డ్రామా!

1990లో కిన్నెర మార్బుల్స్‌కు అప్పటి ఏపీఐఐసీ ప్లాట్ కేటాయించింది. కేవలం ఐదేళ్లు మాత్రమే నడిచిన ఈ పరిశ్రమ ప్రభుత్వ సబ్సిడీలు పొందిన తర్వాత 1995లో మూతపడింది. కొత్తగూడెం ఏజెన్సీ పరిధిలోకి రావడంతో 1/70 చట్టం అమల్లోకి వచ్చి, గిరిజనేతర సంస్థ అయిన కిన్నెరకు టీఎస్ఐఐసీ ఎలాంటి సేల్ డీడ్ (రిజిస్ట్రేషన్) చేయలేదు. చట్టపరంగా సేల్ డీడ్ లేనప్పుడు ఆ భూమిపై కిన్నెర యాజమాన్యానికి ఎలాంటి పూర్తి హక్కులు ఉండవు, ప్రైవేట్ లీజులు ఇచ్చే అధికారం అసలే ఉండదు. అయినా, దాదాపు 25 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత 2020లో కోర్టు ఉత్తర్వుల ముసుగులో కదలిక తెచ్చి, 2024 జనవరి 31న 'రూట్‌వెల్ ఆగ్రో వెట్' సంస్థకు ప్రైవేట్ రెంటల్ ఒప్పందం ద్వారా భూమిని కట్టబెట్టారు. ఇందులో కిన్నెర సంస్థ తనను తాను ‘అబ్సల్యూట్ ఓనర్’ (సంపూర్ణ యజమాని) గా ప్రకటించుకోవడం గమనార్హం. ప్రభుత్వ పత్రాల్లో సేల్ డీడే లేనప్పుడు ఈ యజమానపు హక్కు ఎక్కడి నుంచి వచ్చిందనేది ఇక్కడ ప్రధాన ప్రశ్న. ఆసక్తికరమైన విషయమేమిటంటే.. ఈ రెండు సంస్థల సూత్రధారులు ఒకేకుటుంబానికి చెందిన వ్యక్తులుగా ఉండటమే ఈ బినామీ నాటకానికి బలాన్నిస్తోంది.




కిన్నెర మార్బుల్స్: చుంచుపల్లి పారిశ్రామిక వాడలో కిన్నెర మార్బుల్స్‌కు కేటాయించిన ప్లాట్ నంబర్ 17 ప్రాంగణం.

రూట్‌వెల్ ఆగ్రో వెట్: అదే ప్లాట్ నంబర్ 17లో ప్రస్తుతం కనిపిస్తున్న రూట్‌వెల్ ఆగ్రో వెట్ సంస్థ బోర్డు.

### ›› అనుమతి తిరస్కరిం

### చినా.. అక్రమ సామ్రాజ్యం!

కిన్నెర భూమిలో రూట్‌వెల్ సంస్థ కార్యకలాపాలు సాగించడంపై టీఎస్ఐఐసీ నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు లేవని ప్రభుత్వ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సంవత్సరం మొదటి నెలలో రూట్‌వెల్ సంస్థ సబ్‌లీజు అనుమతి కోరగా, 18 ఫిబ్రవరి 2026 నాటి లేఖ ద్వారా టీఎస్ఐఐసీ ఖమ్మం జోనల్ ఆఫీస్ ఆ విజ్ఞప్తిని ఖరాకండిగా తిరస్కరించింది. సేల్ డీడ్ లేని స్థలంలో సబ్‌లీజులు చెల్లవని తేల్చిచెప్పింది. ప్రభుత్వ శాఖ అధికారికంగా వద్దని చెప్పినా, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో అదే ప్రాంగణంలో రూట్‌వెల్ కంపెనీ తన దందాను నిరభ్యంతరంగా కొనసాగించింది.

### ›› దొంగ కరెంట్.. పరిక

### రాలు లేని నాణ్యత!

ఆర్గానిక్, బయో ఫెర్టిలైజర్స్ తయారు చేస్తామని అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ నుంచి అనుమతులు పొందిన రూట్‌వెల్ సంస్థ ప్రాంగణాన్ని కొంత కాలం క్రితం అగ్రికల్చర్ ఏడీఏ బృందం క్షేత్రస్థాయిలో తనిఖీ చేయగా విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. ఎఫ్‌సీఓ నిబంధనల ప్రకారం ల్యాబ్‌లో ఉండాల్సిన రోటరీ వ్యాక్యూమ్ డ్రైయర్, కండక్టివిటీ మీటర్ వంటి కనీస నాణ్యతా పరీక్ష పరికరాలు అక్కడ మచ్చుకైనా లేవు. దీంతో తప్పుడు పత్రాలతో పొందిన లైసెన్సులను తక్షణమే రద్దు చేయాలని అధికారులు ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఇటు విద్యుత్ శాఖ నివేదికలు తిరగేస్తే రూట్‌వెల్ పేరిట అసలు మీటరే లేదని, పాత కిన్నెర మార్బుల్స్ సర్వీస్ కనెక్షన్ పైనే అక్రమంగా కరెంట్ వాడుతున్నారని తేలిపోయింది.

### ›› రూ.3.75 కోట్ల బ్యాంక్ లోన్ ఎలా .. ?

ఈ దందాలోని అసలు లొసుగు ఇక్కడే ఉంది. టీఎస్ఐఐసీ సేల్ డీడ్ లేదు, సబ్‌లీజు అనుమతి లేదు, భవన అనుమతులు లేవు, ఫ్యాక్టరీలో నాణ్యతా పరికరాలు లేవు, సొంత విద్యుత్ కనెక్షన్ లేదు! ఇన్ని 'లేవు'ల మధ్య ఒక చెల్లుబాటు లేని ప్రైవేట్ రెంటల్ అగ్రిమెంట్‌ను చూపి ఏకంగా రూ.3.75 కోట్ల బ్యాంకు రుణం ఎలా పొందారనేదే ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత కీలకమైన విషయం. దీంతోఅసలు ల్యాండ్ టైటిల్ పరిశీలించకుండా బ్యాంకర్లు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఎలా మంజూరు చేశారు? సంబంధిత ప్రభుత్వ శాఖల రికార్డులను ఎందుకు క్రాస్ చెక్ చేయలేదు? అనే ప్రశ్నలు మొదలవుతున్నాయి. ఇకకాగితాల్లో చూపిస్తున్న డ్రామాలకు, ఖాతాల్లో జమ అవుతున్న కోట్ల రూపాయల నిధులకు వెనుక ఉన్న ఆ బడా బాబు ఎవరు కిన్నెర – రూట్‌వెల్ డైరెక్టర్ల వివరాలు, కోర్టు ఆదేశాలు, ప్రైవేట్ అగ్రిమెంట్, టీఎస్ఐఐసీ తిరస్కరణ ఉత్తర్వులు, వ్యవసాయ శాఖ నివేదికలు, విద్యుత్ వివరాలు, బ్యాంకు లోన్ డాక్యుమెంట్లపై జిల్లా కలెక్టర్ పక్కా ఇన్వెస్టిగేషన్ జరిపితే తప్ప ఈ పారిశ్రామిక–బ్యాంకింగ్ అక్రమ దందా అసలు రూపం బయటపడదు. నిబంధనలను బొంద పెట్టిన ఈ వ్యవహారంపై యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

# ఈ పాపం ఎవరిది?



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 25, (ప్రజా జ్యోతి )** పాల్వంచ మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో వేటగాళ్ల దుశ్చర్యకు ఒక నిండు గర్భిణీ దుప్పి మృత్యువాత పడిన సంఘటన మంగళవారం జరిగింది, వివరాల్లోకెళ్తే__ పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసాని అభయారణ్యంలో ఒక దుప్పి వేటగాళ్లు వేసిన ఉచ్చులో పడి తీవ్రంగా గాయపడగా స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని అప్పటికే చిక్కుకొని రక్తస్రావంతో ఇబ్బంది పడుతున్న దుప్పిని చికిత్స నిమిత్తం వెటర్నరీ వైద్యుల వద్దకు తీసుకువచ్చారు, అయితే అప్పటికే పరిస్థితి విషమంగా మారింది, దుప్పిని ప్రాణాల నుండి కాపాడేందుకు వెటర్నరీ వైద్యులు ఇందుతేజ తీవ్రంగా ప్రయత్నించారు, అయితే వైద్యులు దుప్పికి చికిత్స చేస్తూనే ఆడ దుప్పి అని గుర్తించడంతోపాటు దుప్పి గర్భిణీ తో ఉండగా దుప్పి కడుపులో ఉన్న తల్లి దప్పుతోపాటు పిండాన్ని బయటకు తీసి ప్రాణాన్ని కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం దక్కలేదు ,తల్లి దుప్పి తో పాటు కడుపులోని పిండం కూడా ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని విడిచింది, వేటగాళ్ల ఉచ్చుకు బలైన దుప్పి మరణాంతరం అధికారులు పోస్టుమార్టం తరలించారు,

**ఈ పాపం ఎవరిది?**

వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్న వన్యప్రాణుల కు కిన్నెరసాని అభయారణ్యంలో రక్షణ కొరవడినట్లు తెలుస్తోంది, గతంలో కూడా అనేకమార్లు వేటగాళ్లకు బలైన వన్యప్రాణులు అనేకం ఉన్నాయి, కిన్నెరసాని అభయారణ్యంలోకి వెళ్లి వేటగాళ్లు వన్యప్రాణులను హతమార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ వైల్డ్ లైఫ్ ఫారెస్ట్ అధికారులు చేస్తున్న విధుల పట్ల స్థానికులు మాత్రం అధికారుల నిర్లక్ష్యం కారణంగానే వన్యప్రాణులు బలవుతున్నాయని పాపోతున్నారు, నేడు మృతి చెందిన ఆడ దుప్పి కి సకాలంలో వైద్యం అందినట్లయితే బతికుండదేమోనని స్థానికులు చర్చించుకుంటున్నారు, వన్యప్రాణులకు ఎలాంటి గాయాలైన అత్యవసర సమయంలో అందుబాటులో వెటర్నరీ వైద్యులు ఉన్నట్లయితే కొంత మేరకు వాటి ప్రాణాలను కాపాడవచ్చు అని ప్రజలు కోరుతున్నారు, ఏదేమైనప్పటికీ నిండు గర్భిణీ తో ఉన్న ఆడదుప్పి మృతి చెందడంతో ఈ పాపం ఎవరిది అంటూ ప్రజలు చర్చించుకోవడం చర్చనీయాంశంగా మారింది, ఇప్పటికైనా వైల్డ్ లైఫ్ ఫారెస్ట్ అధికారులు కిన్నెరసాని అభయారణ్యంలో నిఘా పెంచి మరోసారి వేటగాళ్ల ఉచ్చుకు వన్యప్రాణులు బలవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు, మృతి చెందిన దుప్పి మృతి పై అటవీ అధికారులు నిబంధనల మేరకు కేసు నమోదు చేసి వేటకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు

# ఎల్ నినో ప్రభావంపై ముందస్తు చర్యలు చేపట్టాలి

- **ఎల్ నీనో ప్రభావంతో వాతావరణ బట్టి ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను రూపొందించుకోవాలి**
- **నీట్__ పీజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**
- **రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎస్ సంజయ్ జాజు**





**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 25,(ప్రజా జ్యోతి)** రాష్ట్రంలో నెలకొన్న సీజనల్ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావం, ఈ నెల 30న నిర్వహించనున్న నీట్ __ పీజీ ప్రవేశ పరీక్ష ఏర్పాట్లు, పర్యాటక రంగ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని, తక్కువ నీటి అవసరమయ్యే పంటల సాగుతో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సీఎస్ సూచించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నెల 30న నిర్వహించనున్న నీట్ __ పీజీ ప్రవేశ పరీక్షకు పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, భద్రత, రవాణా తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సీఎస్ సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ టూరిజం 2047 పాలసీలో భాగంగా జిల్లాల్లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను గుర్తించి మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, పరిశుభ్రత, పర్యాటకుల సౌకర్యాలను మెరుగుపరచాలని తెలిపారు. స్పిరిచువల్, హెరిటేజ్, ఎకో, క్రాఫ్ట్స్ టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో గుర్తించిన 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసి తెలంగాణ బ్రాండ్‌ను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తరించేందుకు కృషి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, నీట్ __ పీజీ పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను గుర్తించి వాటి అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో నాగలక్ష్మి , సిపిఓ సునీత, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, భూగర్భ జల శాఖ ఏడి రమేష్, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎర్రగుంట పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారం రాథోడ్

- **వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి**
- **ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటిన డాక్టర్ తుకారం రాథోడ్**



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 25 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ఎర్రగుంట పీహెచ్‌సీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వివిధ వైద్య సేవల గురించి రోగులు, స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన డీఎంహెచ్‌వో, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఆరోగ్యకరమైన వాతావరణం కోసం చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా డాక్టర్ తుకారం రాథోడ్ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంట పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ నాజనిన్ తబస్సుమ్, సీహెచ్‌ఓ వాణి, పీహెచ్‌ఎన్ ఎస్తేర్ రాణి, హెచ్ఈఓ రామ ప్రసాద్, హెచ్ఎస్ ప్రకాశరావు, ఎన్ఓ సత్యవతి, ఎల్‌టీ రామారావు, రామదాసు, కోటేశ్వరరావు, రవి కుమార్, పుష్పరాజ్యం, రమాదేవి తదితర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# మతసామరస్యంతో శాంతియుతంగా పండుగలను జరుపుకోవాలి



**ఇల్లందు, ఆగస్ట్ 25 (ప్రజా జ్యోతి )** ప్రజలంతా మతసామరస్యంతో శాంతియుతంగా పండగలను జరుపుకోవాలని ఇల్లందు డిఎస్పి యు వెంకన్న బాబు సూచించారు. మిలాద్ ఉల్ నబి పండుగను పురస్కరించుకొని మంగళవారం ముస్లింలతో పోలీస్ స్టేషన్ లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ఎవరు పండుగలు జరుపుకున్న శాంతియుతంగా, ఎవరి మతాన్ని కించపరచుకోకుండా జరుపుకోవాలని కోరారు. ఎవరి సాంప్రదాయాలను వారు అగౌరపరచవద్దన్నారు. ఈ సమావేశంలో ఇల్లందు సీఐ తాటి పాముల సురేష్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# మొక్కలతోనే మానవాళికి మనుగడ



**ఇల్లందు, ఆగస్ట్ 25 (ప్రజా జ్యోతి )** మొక్కలతోనే మానవాళికి మనుగడ సాధ్యమని ఏటిడిఓ భారతి దేవి అన్నారు. మండలంలోని చెన్నంగుల గడ్డ ఆశ్రమ పాఠశాలలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, తగ్గుతున్న వర్షపాతం వంటి సమస్యలకు మొక్కలు పెంపకమే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నామానాయక్, సర్పంచ్, ఉప సర్పంచ్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

- అధ్యక్షులుగా తోకల సాయికుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక



**పినపాక,ఆగష్టు 25(ప్రజాజ్యోతి )** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ ఆదేశాల మేరకు ,జిల్లా ఇంచార్జ్ మొలకలపల్లి రవి మాదిగ సూచన మేరకు పినపాక మండల ఇంచార్జ్ వాలేపోగు వెంకటేశ్వర్లు మాదిగ ఆధ్వర్యంలో నూతన ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నుకోవడం జరిగింది.ఎమ్మార్పీఎస్ పినపాక మండల అధ్యక్షులుగా తోకల సాయికుమార్ మాదిగ ,గౌరవాధ్యక్షులుగా సోంపెల్లి తిరుపతి మాదిగా ఉపాధ్యక్షులు పూస వెంకటేశ్వర్లు మాదిగ ,వర్కింగ్ ప్రెసిడెంట్ కాళ్ల సతీష్ మాదిగ, అధికార ప్రతినిది మంద కార్తిక్ ,ప్రధాన కార్యదర్శి ఇసంపెల్లి సతీష్ మాదిగ,ప్రచార కార్యదర్శి పుల్లెపోకు రాము మాదిగ ,సహాయ కార్యదర్శి బాచి పోగు ప్రవీణ్ మాదిగ ,కోశాధికారి సోంపల్లి కుమారస్వామి ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా వరికీల గోపయ్య, ,సోంపల్లి ముతేష్ ,సోంపల్లి సిసింద్రీ ,వడ్డూరి ముత్తయ్య ,వరికిల రవి , నలందసరి వెంకన్న ,వరికిల్ల వీర్రాజు,సోంపల్లి ప్రశాంత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా ఎన్నికైన తోకల సాయికుమార్ మాట్లాడుతూ... అధిష్టానం ఆదేశాలతో,మండల ఇంచార్జ్ వల్లెపోగు వెంకటేశ్వర్లు సహకారంతో ఎమ్మార్పీఎస్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు.

## దమ్మపేటకు న్యాయస్థానం రావడంలో రాజేంద్రప్రసాద్ కృషి చిరస్మరణీయం



**దమ్మపేట,ఆగస్టు. 25,(ప్రజాజ్యోతి ):** దమ్మపేటలో న్యాయస్థానం ఏర్పాటు కావడానికి సుదీర్ఘకాలంగా కృషి చేసిన సత్తుపల్లి సీనియర్ న్యాయవాది, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందడపు రాజేంద్రప్రసాద్‌ను దమ్మపేట బార్ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భముగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళీమోహన్ మాట్లాడుతూ న్యాయం కోసం ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లి సమయం, డబ్బు వృథా చేసుకోకుండా న్యాయస్థానం ప్రజల చెంతనే ఉండాలనే ఆలోచనతో మందడపు రాజేంద్రప్రసాద్ దమ్మపేటలో కోర్టు ఏర్పాటు కోసం ప్రయత్నాలు ప్రారంభించారని. ముఖ్యంగా పేదలు, సామాన్యులు న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం వల్ల పడుతున్న ఇబ్బందులను గుర్తించి, కోర్టు ఏర్పాటును ఒక ప్రజా అవసరంగా భావించి తన వంతు కృషి చేశారని తెలియజేశారు. ఆయన పట్టుదల, న్యాయవ్యవస్థ పట్ల ఉన్న నిబద్ధత, ప్రజల పట్ల ఉన్న బాధ్యత ఫలితంగా దమ్మపేటలో న్యాయస్థానం ఏర్పాటుకు మార్గం సుగమమైందని బార్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం మరింత చేరువ కావడానికి కృషి చేసిన రాజేంద్రప్రసాద్ సేవలను గుర్తిస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళీమోహన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దమ్మపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డాక్టర్ బి. భవాని, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ లక్కినేని నరేంద్రబాబు, వైస్ ప్రెసిడెంట్ శ్యాం సుధాకర్, సత్తుపల్లి సీనియర్ న్యాయవాది, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. ఆడమ్స్, న్యాయవాదులు తుమ్మ రాంబాబు, దారా మాధవరావు, కాలం సంధ్యారాణి, సంజయ్, భవాని కృష్ణ యాదవ్, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**పినపాక నియోజకవర్గం ఏజెన్సీ ప్రాంతానికి ముఖద్వారమైన మణుగూరు మండల కేంద్రం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. సింగరేణి కార్మికులు, బీటీపీఎస్ కార్మికులు, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల వ్యవసాయ కుటుంబాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో దాదాపు 25 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ కనెక్షన్లను నమ్ముకొని మూడు ప్రధాన గ్యాస్ ఏజెన్సీలు మండలంలో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. అయితే ఈ ఏజెన్సీలు ప్రభుత్వం నుండి అనుమతి పొందిన చోట గోడౌన్లు నిర్వహించకుండా జనసాంద్రత అధికంగా ఉన్న రహదారి పక్కన, పాఠశాలలు, నివాస గృహాల మధ్య అత్యంత ప్రమాదకర రీతిలో గోడౌన్లు ఏర్పాటు చేసి వందలాది సిలిండర్లను నిల్వ చేస్తున్నాయి. అగ్నిమాపక శాఖ అనుమతులు, భద్రతా చర్యలు లేకుండానే ఈ దందా సాగుతుండడం గమనార్హం. ఒకవేళ ఏమైనా జరిగితే మొత్తం ఏరియా బూడిదయ్యే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.**

# గ్యాస్ ఏజెన్సీల ఇష్టారాజ్యం...

- అనుమతులు ఒకచోట - గోడౌన్లు మరోచోట
- ప్రభుత్వ రేటు కంటే అదనంగా దోపిడీ
- అధికారుల నిర్లక్ష్యం...



**మణుగూరు, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి ) :** మణుగూరు మండలంలో గ్యాస్ ఏజెన్సీల ఆగడాలు రోజురోజుకూ శృతిమించుతున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజల వంటి అవసరమైన గ్యాస్ సిలిండర్ ఇప్పుడు గ్యాస్ ఏజెన్సీలకు కాసుల పంటగా మారింది. ప్రభుత్వ నిబంధనలు, అనుమతులను తుంగలో తొక్కి కొన్ని గ్యాస్ ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అనుమతులు పొందేది ఒకచోట అయితే, గోడౌన్లు నిర్వహిస్తుంది మరోచోట. దీంతో భద్రతా ప్రమాణాలు గాలికొదిలి, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజల నిత్యావసరమైన వంట గ్యాస్ ను అడ్డుపెట్టుకుని కొన్ని ఏజెన్సీలు బహిరంగ దోపిడీకి పాల్పడుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను, భద్రతా ప్రమాణాలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరుపై మండల వ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**అనుమతులు ఒకచోట – గోడౌన్లు మరోచోట...**

మణుగూరు మండలంలో గ్యాస్ యజమానులు నిబంధనలు తుంగలో తొక్కుతూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని పలువురు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీల నిర్వాకం తీవ్ర విమర్శలకు దారితీస్తోందని పలువురు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చింది ఒక చోట అయితే, గోడౌన్లు నిర్వహిస్తున్నది మరోచోట. ఈ వ్యవహారం ఇప్పుడు మండలంలో హాట్ టాపిక్ గా మారింది. నిబంధనల ప్రకారం గ్యాస్ గోడౌన్ అనేది జనావాసాలకు దూరంగా విశాలమైన స్థలంలో పూర్తిగా భద్రతా ప్రమాణాలతో ఉండాలి. రెవెన్యూ శాఖ, పౌర సరఫరాల శాఖ, అగ్నిమాపక శాఖ, పేలుడు పదార్థాల నియంత్రణ సంస్థ (పిఈఎస్ఓ) నుండి అనుమతులు తీసుకోవాలి. అనుమతి పొందిన స్థలంలోనే గోడౌన్ నిర్వహించాలి. మండలంలో దీనికి పూర్తి విరుద్ధంగా జరుగుతోంది. కాగితాల్లో ఒకచోట అధికారులకు చూపించే పత్రాల్లో, అనుమతుల్లో గోడౌన్ మండలానికి 3-4 కి.మీ దూరంలో ఖాళీ ప్రదేశంలో ఉన్నట్లు చూపిస్తున్నారు. కానీ వాస్తవంగా వ్యాపారం కోసం, అద్దె మిగిల్చుకోవడం కోసం రద్దీగా ఉండే మెయిన్ రోడ్డు పక్కన, ఇరుకైన రేకుల షెడ్లలో, ఇళ్ల మధ్యలో గోడౌన్లను నిర్వహిస్తున్నారు. ఒక్కో గోడౌన్ లో 100 నుండి 300 సిలిండర్లు నిల్వ ఉంటున్నాయి. జనాల మధ్యలో ఇలాంటి గోడౌన్ పేలితే 100 మీటర్ల పరిధిలో అంతా బూడిదే అవుతుందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అగ్నిమాపక పరికరాలు కూడా ఉండడం లేదని ప్రజాతంత్ర వాదులు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు. అనుమతి ఉన్న గోడౌన్ కు అధికారులు తనిఖీకి వెళ్తే అక్కడ 10-20 సిలిండర్లు పెట్టి, అంతా బాగుందని నమ్మిస్తున్నారు. అసలు దందా అంతా అనుమతి లేని గోడౌన్ లోనే సాగుతోందని పలువురు మేధావులు మండిపడుతున్నారు. అనుమతి లేని గోడౌన్ల నుండే సిలిండర్లను హోటళ్లు, టీ కొట్లు, పరిశ్రమలకు అధిక ధరకు అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సామాన్యులకు గ్యాస్ కొరత ఏర్పడుతోందని గ్యాస్ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే మణుగూరు మండలంలోని గ్యాస్ గోడౌన్లను ఆకస్మికంగా తనిఖీ చేసి, పత్రాల్లో ఉన్న అడ్రస్ కు, వాస్తవంగా ఉన్న అడ్రస్ కు పొంతన ఉందా లేదా అని తేల్చాలని, నిబంధనలు ఉల్లంఘించిన ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, సామాజికవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

**గ్యాస్ ఏజెన్సీలో క్షేత్రస్థాయి దోపిడీ**

ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ. 855 ఉంటే, వినియోగదారుల నుండి రూ. 880 నుండి రూ. 920 వరకు వసూలు చేస్తున్నారు. అడిగితే ఆటో చార్జీలు, లోడింగ్, అన్ లోడింగ్ అంటూ బుకాయిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. అదే కాకుండా తూకంలో మోసం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.14.2 కిలోల గ్యాస్ ఉండాల్సిన సిలిండర్ లో 1 నుండి 2 కిలోల వరకు తక్కువగా ఉంటోందని మహిళలు ఆరోపిస్తున్నారు. తూకం వేసే మిషన్ ఏజెన్సీల వద్ద ఉన్నా,వినియోగదారుల ముందు ఎప్పుడూ తూకం వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుకింగ్ చేస్తే నెలల తరబడి జాప్యం జరుగుతుందని, గ్యాస్ బుక్ చేసిన 2-3 రోజుల్లో రావాల్సి ఉండగా, మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన రేగుల గండి, ఖమ్మంతోగు, బుడుగుల, పగిడేరు, ఇప్పల గుంపు, పెద్దపెల్లి, చినరావిగూడెం తదితర గ్రామాలకు 15-20 రోజులు ఆలస్యంగా పంపిస్తున్నారని లబ్ధిదారులు ఆపోతున్నారు. దీంతో ప్రజలు కట్టెల పొయ్యిలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడుతుందని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**డెలివరీ బాయ్స్ మరో దందా**

మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా గ్యాస్ లబ్ధిదారులకు డెలివరీ బాయ్స్ గుది బండగా మారిన దుస్థితి.సిలిండర్ ఇంటికి తెచ్చినప్పుడు బిల్లు ఇవ్వకుండా అదనపు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇవ్వకపోతే మరో సారి గ్యాస్ ఇవ్వమని బెదిరిస్తున్నారని గృహిణులు వాపోతున్నారు. మణుగూరు పట్టణంలో గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలంటే రెండు అంతస్తుల భవనం కింద ఇవ్వాలి అంటే 50 రూపాయలు పై అంతస్తు భవనం ఎక్కితే 60 రూపాయలు ఇవ్వాలంటూ గ్యాస్ డెలివరీ బాయ్స్ డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**అధికారుల పాత్రపై అనుమానాలు**

ఇంత జరుగుతున్నా పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు తనిఖీలు చేయకపోవడం వెనుక ఏదైనా మామూళ్ల మతలబు ఉందా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేడని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





# మొక్కలు నాటుదాం.. పచ్చదనాన్ని పెంచుదాం





**చర్ల, ఆగస్టు 25:(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా చర్ల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.చర్ల ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, మండల తహసీల్దార్ శ్రీనివాస్, చర్ల సీఐ రాజు వర్మతో పాటు అటవీ శాఖ అధికారులు పాల్గొని మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చెట్లు పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని మొక్కలతో వాతావరణంలో సమతుల్యత ఏర్పడటంతో పాటు గాలి కాలుష్యం తగ్గుతుందని పచ్చని చెట్లు మానవాళికి స్వచ్ఛమైన గాలిని అందించడంతో పాటు జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.ప్రస్తుత కాలంలో పర్యావరణ కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని ఒక సామాజిక బాధ్యతగా తీసుకోవాలని అధికారులు సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు భాగస్వాములు కావాలని కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాల్లో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని క్రమం తప్పకుండా సంరక్షించాలని సూచించారు. మొక్కలు పెరిగితే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని తెలిపారు.అనంతరం చర్ల రైతు వేదికలో కూడా వన మహోత్సవ కార్యక్రమాన్ని చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు,వ్యవసాయ అధికారి అఫ్రిది ఆధ్వర్యంలో నిర్వహించారు . పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్ల మండలంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. చెట్లను పెంచడం వల్ల వాతావరణంలో కాలుష్యం తగ్గడంతో పాటు పచ్చదనం పెరుగుతుందని, వర్షాభావ పరిస్థితులను కొంతమేర తగ్గించేందుకు కూడా చెట్లు దోహదపడతాయని అన్నారు.చర్ల మండలంలోని గ్రామాల్లో వన మహోత్సవ కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విస్తృతంగా నిర్వహించాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చర్ల పంచాయితీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, పంచాయతీ సెక్రెటరీ రాంబాబు, మండల తాసిల్దార్ శ్రీనివాస్, చర్ల సిఐ రాజు వర్మ ,ఎస్సై నర్సిరెడ్డి, ఫారెస్ట్ అధికారి రంజిత, చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, వ్యవసాయ అధికారి అఫ్రిది , పాఠశాల ఉపాధ్యాయుల సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## నాయి బ్రాహ్మణుల సమస్యలపై సమావేశం



**చర్ల, ఆగస్టు 25:(ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చర్ల మండలంలో నాయి బ్రాహ్మణుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.నాయి బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సంఘ నాయకులు అన్నారు . నాయి బ్రాహ్మణుల ఐక్యతను మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి తోటపల్లి మాధవరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోరింట్ల వెంకటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి తోటపల్లి రాంబాబు, డివిజన్ నాయకులు కొండ్రు హరీష్, సీనియర్ నాయకులు కూర్మాపు అప్పలరాజు, చర్ల మండల అధ్యక్షులు తోటపల్లి రమణ, మండల కార్యదర్శి రాజేష్, కోశాధికారి అయిన విల్లి శ్రీను, నేదునూరి చక్రవర్తి, ప్రచార కార్యదర్శి గోరింట్ల శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు పి.కుమారితో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వన మహోత్సవం




**చర్ల, ఆగస్టు 25:(ప్రజా జ్యోతి ):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జి. జయశ్రీ ముఖ్య అతిథిగా హాజరై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులతో కలిసి కళాశాల ప్రాంగణంలో వివిధ రకాల నీడనిచ్చే, పూలు, పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ పీవో జి. సుధాకర్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని కళాశాల అధ్యాపకులు అన్నారు .ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆగస్టు 27న ఉద్యోగ, ఉపాధ్యాయుల మహాధర్నా విజయవంతం చేయండి

- టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి పిలుపు



**ఆళ్ళపల్లి,ఆగస్టు25(ప్రజా జ్యోతి)** టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 27న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న మహాధర్నాను ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు పిలుపునిచ్చారు. మైలారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 25ను సవరించి, జీవో 190ను నేరుగా అమలు చేయాలని, టెట్ వెయిటేజీ మార్కులను తగ్గించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఐక్యతే ఉద్యమానికి బలమని పేర్కొంటూ, అన్ని సంఘాల నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై మహాధర్నాను విజయవంతం చేయాలని జోగ రాంబాబు కోరారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బానోతు బోజ్య, కొమరం వసంతరావు, కొమరం లాలయ్య, ఎన్. రామకృష్ణ, హరినాథ్, కుమార్ రాజా, శ్రీను, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## లింగాపురంలో వన మహోత్సవం కార్యక్రమం

- మొక్కలు నాటిన సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి




**చర్ల , ఆగస్టు 25 :( ప్రజా జ్యోతి ):** పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో లింగాపురం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామాన్ని పచ్చని వాతావరణంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు గ్రామంలోని పలు ప్రాంతాల్లో పచ్చని మొక్కలను నాటారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోతు మంగ, ఉప సర్పంచ్ తడికల నరేష్, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు అన్నారు . మొక్కలు నాటడం వల్ల పర్యావరణ సమతుల్యతతో పాటు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుందని తెలిపారు. మన భూమి.. మన బాధ్యత అనే నినాదంతో ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని లింగాపురం గ్రామాన్ని ఆకుపచ్చగా మార్చి ఆకుపచ్చని లింగాపురం – ఆరోగ్యమైన లింగాపురంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వన మహోత్సవ కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.గ్రామంలో పచ్చదనం పెంపొందితే వాతావరణ కాలుష్యం తగ్గడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు . వన మహోత్సవంలో భాగంగా గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పలు రకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మహాలక్ష్మి , దివ్య, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



**ములకలపల్లి ఆగస్టు 25 (ప్రజాజ్యోతి ):** రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల నాయకుడు ముదిగొండ ప్రశాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్సీ హాస్టల్‌లో జరిగిన ఎస్ఎఫ్ఐ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖకు వెంటనే మంత్రిని కేటాయించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు, నాణ్యమైన భోజనం కల్పించాలని, డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సంజయ్, రవిచంద్ర, వంశీ, రాకేష్, దీపక్, శేఖర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు

## కాంకేర్ లో నక్సలైట్‌ల డంప్ స్వాధీనం




**చర్ల , ఆగస్టు 25:(ప్రజా జ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో నక్సలైట్ నిర్మూలన ఆపరేషన్‌లో భద్రతా దళాలు కీలక విజయం సాధించాయి. ఛోటేబెథియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోర్ఖండి గ్రామ అటవీ, కొండ ప్రాంతంలో భూగర్భంలో దాచిపెట్టిన నక్సలైట్ల భారీ ఆయుధ డంప్‌ను సంయుక్త బృందం స్వాధీనం చేసుకుంది.కాంకేర్ జిల్లాలోని నక్సల్ ప్రభావిత, సరిహద్దు ప్రాంతాల్లో బీఎస్ఎఫ్, జిల్లా పోలీసు దళం, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ (బీడీఎస్) సంయుక్తంగా గాలింపు చర్యలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా ఆగస్టు 24న మోర్ఖండి గ్రామంలోని అటవీ, కొండ ప్రాంతంలో అనుమానాస్పద ప్రదేశాన్ని భద్రతా సిబ్బంది తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూగర్భంలో దాచిన నక్సలైట్ డంప్‌ను గుర్తించారు.డంప్‌ను సోదా చేయగా డంప్‌లో నాలుగు భర్మర్ తుపాకులు, మూడు భర్మర్ గన్ బ్యారెళ్లు, ఒక వైర్‌లెస్ సెట్, విద్యుత్ తీగల మూడు కట్టలు, ఒక జీపీఎస్, ఒక చిన్న సోలార్ ప్లేట్, ఒక ఛార్జర్ లభించాయి. వీటితో పాటు పెద్ద మొత్తంలో నక్సలైట్ సాహిత్యం, ఇతర నక్సలైట్ సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నారు.భద్రతా కారణాల దృష్ట్యా ఆపరేషన్ సమయంలో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ (బీడీఎస్) బృందాన్ని కూడా సంఘటనా స్థలంలో మోహరించారు. గాలింపు, స్వాధీనం చర్యలు పూర్తయిన అనంతరం సంయుక్త బృందంలోని సిబ్బంది సురక్షితంగా తమ శిబిరానికి తిరిగి వచ్చారు.మోర్ఖండి అడవిలో నక్సలైట్ల డంప్ స్వాధీనం చేసుకోవడం ఆపరేషన్‌లో ముఖ్యమైన విజయమని భద్రతా దళాలు పేర్కొన్నాయి. కాంకేర్ జిల్లాలో నక్సల్ కార్యకలాపాలను అరికట్టడంతో పాటు శాంతిభద్రతలను పరిరక్షించేందుకు మరింత ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

## వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 25,(ప్రజా జ్యోతి )** వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. ఇల్లందు క్రాస్‌రోడ్‌లోని చలమల శ్రీనివాసరావు మెమోరియల్ సెంట్రల్ పార్క్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి వన మహోత్సవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, అవి మనుగడ సాగించేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, రక్షణ కల్పించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాల విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు సమష్టిగా కృషి చేసి వన మహోత్సవ లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో పచ్చదనానికి బాట

- రోడ్డుకిరువైపులా మొక్కలు నాటి సంరక్షించాలి: జడ్పీ సీఈవో నాగలక్ష్మి

**బూర్గంపహాడ్, ఆగస్టు 25 (ప్రజా జ్యోతి):** పారిశ్రామిక ప్రాంతంగా పేరొందిన మేజర్ సారపాకను పచ్చని వనంలా తీర్చిదిద్దేందుకు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని జడ్పీ సీఈవో నాగలక్ష్మి అన్నారు. మంగళవారం వనమహోత్సవంలో భాగంగా ఎంపీడీవో జమలారెడ్డి, సర్పంచ్ కిషోర్ నాయక్ ఆధ్వర్యంలో సారపాకలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.మసీదు రోడ్డు నుంచి నూతనంగా నిర్మించిన గోదావరి వంతెన వరకు రోడ్డుకు ఇరువైపులా వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో నాగలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాద్రి పుణ్యక్షేత్రానికి సారపాక మీదుగా నిత్యం వేలాది మంది భక్తులు రాకపోకలు సాగిస్తారని తెలిపారు. సారపాక ప్రవేశమార్గం పచ్చదనంతో ఆహ్లాదకరంగా కనిపించేలా రోడ్డు ఇరువైపులా అందమైన మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను పంచాయతీ అధికారులు, పాలకవర్గం చేపట్టాలని సూచించారు. వనమహోత్సవంలో భాగంగా ఇప్పటికే వేలాది మొక్కలు నాటినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఐటీసీ అడ్మిన్ మేనేజర్ చెంగల్రావు, ఈజీఎస్ ఏపీవో విజయలక్ష్మి , ఈవో గుగులోత్ రవికుమార్, ఉపసర్పంచ్ కన్నెదారి రమేష్, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.





**ఇరవెండిలో..**

మండలంలోని ఇరవెండి గ్రామంలో సర్పంచ్ గుండి బాబూరావు, ఉపసర్పంచ్ మహంకాళి రామారావు ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. పంచాయతీ ఆవరణ, పల్లె దవాఖానా, క్రీడా ప్రాంగణం పరిసరాల్లో మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు ప్రజలు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్పందన, పంచాయతీ, అటవీ శాఖ సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**కృష్ణసాగర్ లో..**

కృష్ణసాగర్ ఎస్సీ కాలనీ హెల్త్ సెంటర్ లోనూ వనమహోత్సవం నిర్వహించారు. మండల ఉపసర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు భూక్య మోహన్ రావు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగిరెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ బోడ దివ్య, పీఏసీఎస్ డైరెక్టర్ ఉండేటి గోవర్ధన్, గుర్రం సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ హనుమంతరావు, వీవో నాగమణి, నర్సు సుభద్ర, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. మండలవ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, నాయకుల ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాలు నిర్వహించి పెద్దఎత్తున మొక్కలు నాటారు.

## ఓటర్ల జాబితా సవరణలో కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రతి అర్హుడికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం: కొత్వాల శ్రీనివాసరావు



**పాల్వంచ, ఆగస్టు 25, ప్రజాజ్యోతి:** ఓటర్ల జాబితా సవరణ సర్–2 కార్యక్రమాన్ని కాంగ్రెస్ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని చురుగ్గా పాల్గొనాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కొత్తగూడెం విద్యానగర్ కాలనీలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల వర్క్ షాప్ నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని 262 మంది బీఎల్ ఏలు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఓటు ఎంతో విలువైనదని, అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకుండా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడికి ఫారం–6 ద్వారా ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయిలో పార్టీ కార్యకర్తలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, బీఎల్ ఏలు, సూపర్ వైజర్లు నిత్యం సమన్వయంతో పనిచేస్తూ బీఎల్ ఓలను అనుసరిస్తూ ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియను పరిశీలించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు, కొత్తగా పేర్ల నమోదు, చిరునామా మార్పులు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న, పీసీసీ కో–ఆర్డినేటర్ లింగోజీ, కొత్తగూడెం నియోజకవర్గ ఇన్ చార్జి ఆళ్ళ మురళితో పాటు పీసీసీ ప్రధాన కార్యదర్శి నాగా సీతారాములు, కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, డీసీసీ ప్రధాన కార్యదర్శి పెద్దబాబు, అధికార ప్రతినిధి వై. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దివ్యాంగుల ఆటల పోటీలు





**చర్ల, ఆగస్టు 25:(ప్రజా జ్యోతి):** పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో చర్ల మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు మండల స్థాయి ఆటల పోటీలను మంగళవారం సత్యనారాయణపురం జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి పి. వెంకటరమణ మాట్లాడుతూ దివ్యాంగ చిన్నారుల్లోనూ విభిన్నమైన ప్రతిభ, సామర్థ్యాలు ఉంటాయని అన్నారు. వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ఆటల పోటీలు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న పలువురు విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు.అనంతరం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు.ఈ కార్యక్రమంలో సత్యనారాయణపురం జడ్పీ హెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వి. రాజేశ్వరి, కె. దారయ్య, ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు సతీష్, స్వప్న, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ కి పచ్చదనమే ఆభరణం

**వన మహోత్సవంలో భాగంగా 36 గ్రామపంచాయతీల్లో భారీగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం.**

**పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా విస్తృతంగా హరిత కార్యక్రమాలు.**



**పాల్వంచ, ఆగస్టు 25, ప్రజాజ్యోతి:** పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో పాల్వంచ మండలంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని 36 గ్రామపంచాయతీల పరిధిలో భారీ సంఖ్యలో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. వన మహోత్సవంలో భాగంగా నారాయణ రావుపేట గ్రామపంచాయతీలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి. నాగలక్ష్మి పాల్గొని మొక్కలు నాటారు. గ్రామపంచాయతీ పరిధిలో ఒకే రోజు సుమారు 200 మొక్కలను నాటినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, నాటిన మొక్కలను సంరక్షించి అవి వృక్షాలుగా ఎదిగేలా బాధ్యత తీసుకోవాలని అధికారులు సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి. రాజారావు, గ్రామపంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వీబీజీ రామ్‌జీ సిబ్బంది, ఏపీవో, ఈసీతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో వన మహోత్సవ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించడం ద్వారా పాల్వంచ మండలాన్ని మరింత పచ్చదనంతో నింపేందుకు కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నేటి మొక్కలే రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణానికి ఆధారమని పేర్కొన్నారు.

## మండలవ్యాప్తంగా వన మహోత్సవం








**ములకలపల్లి, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి):** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు మొక్కలు నాటి కార్యక్రమాలను ప్రారంభించారు. పాఠశాలలు, రైతువేదికలు, పంచాయతీ కార్యాలయాల ఆవరణల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. మూకమామిడిలో సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి , జగన్నాథపురంలో ప్రాథమిక పాఠశాల ఆవరణం, దమ్మపేట రేంజ్ పరిధిలోని తోగ్గుడెం బిట్ లో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంజా వినోద్ పాల్గొని మొక్కలు నాటారు. మొగరాలగుప్ప పాఠశాలలో గుడ్‌షెఫర్డ్ సంస్థ ఏషియా పసిఫిక్ ప్రోగ్రాం మేనేజర్ శాలిని శ్రీలంక పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్ పార్లమెంట్, సీపీసీఆర్ కమిటీల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచాలని సర్పంచులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి దోమల అరుణ్‌కుమార్, ఏకలవ్య ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, అటవీశాఖ అధికారులు నాగమణి, జోగా భద్రయ్య, రమేష్, నరేష్, ఉప సర్పంచ్ జలగం మాధవి, ఏఈఓ రమేష్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు కొప్పుల రాంబాబు, నాయకులు మడకం శ్రీనివాస్, సురభి రాజేష్, చేకుర్తి రామాచారి, మిడియం నారాయణ, సున్నం నాగేష్, పంచాయతీ సిబ్బంది, అటవీశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రైతులు, మహిళలు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## బంగారు భవిష్యత్తుకు పచ్చని మొక్కలే బాట.. వన మహోత్సవం

**రేంజర్ జోష్ణ దేవి. సర్పంచ్ రమాదేవి. ఉపసర్పంచ్ సతీష్**



**ఆళ్ళపల్లి. ఆగస్టు25(ప్రజా జ్యోతి)** ఆళ్ళపల్లి పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తరణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని రేంజర్ జోష్ణ దేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుతారీ రమాదేవి,ఉప సర్పంచ్. సతీస్. అటవీశాఖ సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా రేంజర్ జోష్ణదేవి మాట్లాడుతూ.. అడవులు, చెట్లు మానవ మనుగడకు ఎంతో కీలకమని అన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు స్వచ్ఛమైన గాలి, వర్షాలు, జీవవైవిధ్య పరిరక్షణకు చెట్లు ప్రధాన ఆధారమని తెలిపారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు.సర్పంచ్ సుతారీ రమాదేవి మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు.అటవీశాఖ సిబ్బంది మాట్లాడుతూ నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, పశువుల నుంచి రక్షించడం, వాటి ఎదుగుదలను పర్యవేక్షించడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.వన మహోత్సవంలో భాగంగా పలుచోట్ల మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమం ద్వారా పచ్చదనం ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ.. ప్రతి ఒక్కరూ మొక్క నాటి, దానిని పెంచి పెద్ద వృక్షంగా తీర్చిదిద్దాలనే సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్ఫోగ్రాఫిక్ స్టడీ మెటీరియల్ ప్రారంభం

**విద్యార్థుల సులభ అధ్యయనానికి వినూత్న డిజిటల్ వనరు**



**పాల్వంచ, ఆగస్టు 25, ప్రజాజ్యోతి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), పాల్వంచలో హిందీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం రూపొందించిన వినూత్న "ఇన్ఫోగ్రాఫిక్ స్టడీ మెటీరియల్"ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. పి. పద్మ ప్రారంభించారు. హిందీ భాష, సాహిత్యానికి సంబంధించిన పాఠ్యాంశాలను విద్యార్థులకు సులభంగా, క్రమబద్ధంగా, ఆకర్షణీయమైన దృశ్యరూపంలో అందుబాటులోకి తీసుకురావడమే ఈ అధ్యయన సామగ్రి ప్రధాన ఉద్దేశమని కళాశాల వర్గాలు తెలిపారు. ఇన్ఫోగ్రాఫిక్ స్టడీ మెటీరియల్‌లో ప్రముఖ హిందీ రచయితలు, కవుల పరిచయాలు, పాఠ్యాంశాల సారాంశాలు, ముఖ్య భావనలు, కీలక అంశాలు, వివరణలు, సాహిత్య లక్షణాలతో పాటు చార్టులు, చిత్రాలు, పరీక్షలకు ఉపయోగపడే ముఖ్యమైన అంశాలను సమగ్రంగా పొందుపరిచారు. దీంతో విద్యార్థులు క్లిష్టమైన పాఠ్యాంశాలను సైతం సులభంగా అర్థం చేసుకుని, త్వరగా పునశ్చరణ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. పి. పద్మ మాట్లాడుతూ హిందీ విభాగం వినూత్న, ఐసీటీ ఆధారిత బోధన–అభ్యసన పద్ధతులను అవలంబించడం అభినందనీయమన్నారు. డిజిటల్ వేదికల ద్వారా అధ్యయన వనరులను విద్యార్థులకు సులభంగా అందుబాటులోకి తీసుకురావడం ప్రస్తుత ఉన్నత విద్యా వ్యవస్థలో ఎంతో ప్రాధాన్యమైందని పేర్కొన్నారు. ఇటువంటి వినూత్న విద్యా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగించాలని హిందీ విభాగాధిపతి డా. టి. అరుణ కుమారిని ప్రిన్సిపాల్ ప్రోత్సహించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతను బోధనలో సమర్థవంతంగా వినియోగించడం ద్వారా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచవచ్చని అన్నారు. హిందీ విభాగాధిపతి డా. టి. అరుణ కుమారి మాట్లాడుతూ ఈ ఇన్ఫోగ్రాఫిక్ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సులభంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. పాఠ్యాంశాలను సంక్షిప్తంగా, దృశ్యరూపంలో అందించడం వల్ల విద్యార్థులకు అవగాహనతో పాటు పరీక్షల సమయంలో పునశ్చరణకు కూడా ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. ఉన్నత విద్యలో నాణ్యతా వృద్ధి, ఐసీటీ సమన్వయం, సమర్థవంతమైన బోధన పద్ధతులకు ఇన్ఫోగ్రాఫిక్ స్టడీ మెటీరియల్ వంటి వినూత్న డిజిటల్ వనరులు గణనీయంగా దోహదపడగలవని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ డా. జె. మాధవి, లైబ్రేరియన్ డా. బి. కొండల రావు, రమేష్ తో పాటు కళాశాల బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.s

## దమ్మపేటలో దివ్యాంగ విద్యార్థుల మండల స్థాయి క్రీడా పోటీలు



**దమ్మపేట, ఆగస్టు. 25, (ప్రజాజ్యోతి)** :దమ్మపేట మండల స్థాయి దివ్యాంగ విద్యార్థుల క్రీడా పోటీలను మంగళవారం టీఎస్‌టీడబ్ల్యూాఆరఈఐఎస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శ్రీ పి. జగపతి, ప్రత్యేక విద్యా బోధకులు, ఐకేపీ సమన్వయకర్త శ్రీ సత్తిబాబు, ఐఈఆర్‌పీలు, ఫిజియోథెరపిస్టులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థుల విద్య, ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల అభివృద్ధికి తల్లిదండ్రులు అందించాల్సిన సహాయ సహకారాలతో పాటు వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలు, అవసరమైన సహాయక చర్యల గురించి వివరించారు. అనంతరం నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. దివ్యాంగ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులు, సిబ్బంది, ఐఈఆర్‌పీలు, ఫిజియోథెరపిస్టులు, విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా వన మహోత్సవం





**మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి : ఎంఈఓ ఆనంద్ కుమార్**

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 25 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలో మంగళవారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనంద కుమార్ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, అన్నదేవం, రాజపురం, ఎర్రగుంట ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఉండేటి ఆనంద కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని తెలిపారు. పాఠశాల ఆవరణల్లో నాటిన మొక్కలను విద్యార్థులు, ఉపాధ్యాయులు బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. ఈ వన మహోత్సవ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రధానాచార్యులు బాలరాజు, అధ్యాపకులు, అన్నదేవం, రాజపురం ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈరు, రమేష్, ఎర్రగుంట ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి సునందరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామ సభ్యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలి



**దమ్మపేట, ఆగస్టు. 25, (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం జగ్గారం గ్రామంలో సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణం కారణంగా భూములు కోల్పోతున్న గిరిజన నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ నిర్వాసితుల నాయకులు కలెక్టరేట్‌లో జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు నిర్వాసితుల నాయకుడు కారం శ్రీరాములు మాట్లాడుతూ.. జగ్గారం ప్రాంతానికి చెందిన 125 మంది గిరిజన నిర్వాసితులు సుమారు 103 ఎకరాల భూమిని సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణం కోసం కోల్పోతున్నారని తెలిపారు. ఈ సమస్యపై గతంలో జాతీయ ఎస్టీ కమిషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ కేసు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉందని వివరించారు. నిర్వాసితులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.8 లక్షల ప్యాకేజీని రద్దు చేసి, ప్రస్తుత భూముల మార్కెట్ విలువలకు అనుగుణంగా కొత్త నోటిఫికేషన్ జారీ చేసి నష్టపోతున్న గిరిజనులకు తగిన నష్టపరిహారం అందించాలని కమిషన్ సభ్యులను కోరారు. నిర్వాసితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులకు సంబంధించిన భూమి, నష్టపరిహారం తదితర పత్రాలను కమిషన్ సభ్యులకు సమర్పించారు. కార్యక్రమంలో నిర్వాసితుల నాయకులు కారం శ్రీరాములు, కురసం చిన్నరాజు, కల్లూరి రాజేష్, వంకా ముత్యాలరావు, బాలకృష్ణ, కారం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మల్లారం పాఠశాలకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేయూత





**విద్యార్థుల భద్రతకు ప్రహరీ గోడ..**

**అత్యవసర మరమ్మతులకు ప్రత్యేక నిధులు**

**దమ్మపేట, ఆగస్టు. 25, (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల పరిధిలోని మల్లారం గ్రామంలో 'నేను సైతం చేయూత' కార్యక్రమంలో భాగంగా 'విద్యా యాత్ర–మన ఎమ్మెల్యే–మన బడి' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారం గ్రామంలోని ఎం.పి.పి.ఎస్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థుల విద్యా విధానం, అభ్యసన నైపుణ్యాలు, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి అభ్యసన సామర్థ్యాలను మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ తక్షణమే ప్రహరీ గోడ నిర్మాణానికి మంజూరు చేయడంతో పాటు పాఠశాల భవనానికి అవసరమైన అత్యవసర మరమ్మతుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు, బిల్లులు వెంటనే చెల్లించాలి

**సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్**




**దమ్మపేట, ఆగస్టు. 25, (ప్రజాజ్యోతి) :** మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు, గుడ్లు, వంట బిల్లులను వెంటనే చెల్లించాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెనూ చార్జీలను పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ జగపతిరావుకు అందజేశారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభమైన మూడు నెలల్లో నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరిగినా, విద్యార్థుల మెనూ చార్జీలను మాత్రం పెంచకపోవడంతో వంట కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించేందుకు కార్మికులు అప్పులు చేసి, సొంత డబ్బులతో గుడ్లు, కూరగాయలు తదితర సరుకులు కొనుగోలు చేసి వంట చేస్తున్నారని అన్నారు. రెండు నెలలుగా గుడ్లు, వంట బిల్లులు విడుదల కాకపోవడంతో కార్మికులపై ఆర్థిక భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలు, బిల్లులు విడుదల చేయడంతో పాటు వంట గ్యాస్, గుడ్లను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులకు గుర్తింపు కార్డులు, యూనిఫామ్‌లు అందించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, సత్యవతి, శ్రీదేవి, పార్వతి, జయలక్ష్మి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అడ్డగోలు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

**- రేగా కాంతారావు ఆరోపణలను ఖండించిన కాంగ్రెస్ నేతలు**

**- రేగాకు మాట్లాడే నైతిక అర్హత లేదు : మండల కాంగ్రెస్ నాయకులు**



**మణుగూరు, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం పై, మంత్రులపై, ఎమ్మెల్యేలపై పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు చేసిన అడ్డగోలు అసత్య ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ సెంటర్లోని డివి ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొని మాట్లాడారు. రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే రేగా కాంతారావు కాంగ్రెస్ పార్టీపై, ప్రభుత్వంపై అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు దూరంగా సుమారు 25 రోజుల పాటు ఉండి ఇప్పుడు రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అవకాశాల వల్లే రేగా కాంతారావు రెండుసార్లు రాజకీయంగా ఎదిగారని పేర్కొన్నారు. ఒక మహిళకు సంబంధించిన కేసులో సాక్ష్యాధారాలు లభించకపోవడంతో కేసు కొట్టివేయబడిన విషయాన్ని ప్రస్తావిస్తూ క్వాష్ పిటిషన్ కొట్టివేయబడినంత మాత్రాన తాను నిజాయితీపరుడినని చెప్పుకోవడం సమంజసం కాదన్నారు. అధికారులను అడ్డుపెట్టుకుని రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై గతంలో చేసిన వ్యాఖ్యలను వారు తప్పుబట్టారు. ఒక మహిళను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే రేగా కాంతారావు ఆరోపణలు చేస్తున్నారన్నారు. దళిత బంధు, లక్ష రూపాయల రుణాలను ఇప్పించి కమీషన్ల కోసం ప్రజలను వేధించలేదా అని ప్రశ్నించారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలపై రాజకీయ ర్యాలీలు నిర్వహించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. సమస్యలుంటే హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమాలు నిర్వహించకుండా మణుగూరులో ఎందుకు ర్యాలీలు చేస్తున్నారని నిలదీశారు. మణుగూరులో భూములకు సంబంధించిన అంశాలపై కూడా కాంగ్రెస్ నాయకులు పలు ప్రశ్నలు సంధించారు. ట్రస్టులు, దేవాలయాలను అడ్డుపెట్టుకుని భూముల ఆక్రమణలకు పాల్పడింది ఎవరో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఆక్రమిత భూములకు రైతు బంధు ప్రయోజనాలు కూడా పొందుతున్నారనే ఆరోపణలపై సమాధానం చెప్పాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ పాయం వెంకటేశ్వర్లు విజయం సాధించడం ఖాయమని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. తమ పార్టీపై నిరాధార ఆరోపణలు చేసి పార్టీ నేతల వద్ద పేరు తెచ్చుకోవాలని ప్రయత్నించడం సరైంది కాదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆనాడు సంతకం చేయని వ్యక్తికి తెలంగాణ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని విమర్శించారు. రేగా కాంతారావు అడ్డగోలు ఆరోపణలు చేయడం మానుకోవాలని, ఎమ్మెల్యే, మంత్రులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు కురం రవి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, శివ సైదులు, బనోత్ లక్ష్మణ్, రామ్ రెడ్డి, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, రాష్ట్ర నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, సర్పంచులు కలబోయిన మాధవరావు, పూణేం రమేష్, పాల్వంచ రాములు, ఎనిక శ్వేత, ఉపసర్పంచ్లు గాండ్ల సురేష్, గోరంట్ల కనకయ్య, వార్డు సభ్యులు కొలపిన్ని మానస, కృష్ణవేణి, జిల్లా ముఖ్య నాయకులు ఆవుల సర్వేశ్వరరావు, కూచిపూడి బాబు, గణేష్ రెడ్డి, మహిళా నాయకులు వరలక్ష్మి, మధు బాబు, కటుకూరి శ్రీను, గుమాస్తాల సంఘం నాయకులు తాతా ప్రసాద్ ,శ్రీను, 12 టైర్ యూనియన్ నాయకులు సురేందర్ రెడ్డి, ముఖ్య నాయకులు మధు బాబు, కటుకూరి శ్రీను, బత్తుల శ్రీను, వాసంశెట్టి వెంకట్రావు, మండల ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు